ప్రజాశక్తి
శనివారం 3 జనవరి 2026
5
అల్లూరి సీతారామరాజు
పోలవరం







చర్చలు జరుపుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధులు

# క్షేత్రస్థాయిలో ఐక్య పోరాటాలు

## కార్మిక, కర్షక మైత్రి కొనసాగాలి

## సిఐటియు 18వ అఖిల భారత మహాసభ చర్చల్లో ప్రతినిధులు

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో / అనతలవట్టం ఆనందన్ నగర్** విశాఖ సాగర తీరాన ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభ శుక్రవారానికి మూడో రోజుకు చేరుకుంది. గత నెల 31న ప్రారంభమైన ఈ మహాసభలో సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రవేశపెట్టిన కార్యకలాపాల నివేదికపైనా, తర్వాత ప్రవేశపెట్టిన నిర్మాణ అంశాల నివేదికపైనా శుక్రవారం సాయంత్రం వరకూ ప్రతినిధులు చర్చలు చేశారు. గత పోరాటాలను సమీక్షించుకున్నారు. క్షేత్రస్థాయిలో కార్మికులు, ప్రజలు, రైతులను ఏకం చేసి పోరాటాలు సాగించాలని రైతాంగ, వ్యవసాయ కూలీల ఉద్యమాలను తీవ్రం చేయాలని ప్రతినిధులు చర్చల్లో వెల్లడించారు. మహాసభల ప్రాంగణమంతా ఎర్రజెండాలు, ఎర్రతోరణాలు, ప్రతినిధుల సందడితో కోలాహలంగా కనిపించింది.

ప్రతినిధుల చర్చల్లో ఇప్పటివరకూ వారివారి రాష్ట్రాల్లో జరిగిన కార్మిక, ప్రజా పోరాటాల సందర్భంగా వచ్చిన అనుభవాలను మూడోరోజు సభలో వెల్లడించారు. మంచి అనుభవాలను ఇతర రాష్ట్రాల వారూ అమలు చేసేలాగ ఉదాహరణలతో సహా వెల్లడించారు. బెంగాల్, కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల్లో జరిగిన కార్మికోద్యమాలు కొత్త కొత్త రంగాల నుంచి కార్మికులు సిఐటియు జెండా వైపు వస్తున్న తీరును పలు రాష్ట్రాల ప్రతినిధులు సభలో ప్రస్తావించారు. బిజెపి పాలిత రాష్ట్రాలు ముఖ్యంగా యుపి, గుజరాత్‌లలో జరుగుతున్న కార్మికోద్యమాల సందర్భంగా ప్రభుత్వ నిర్బంధాలను నివేదికల్లోనూ, చర్చల సందర్భంగా ప్రతినిధులు మాట్లాడిన సమయంలోనూ వెల్లడించారు. బలమైన కార్మికోద్యమాన్ని నిర్మించడంలో సంఘాల వారీగా చైతన్యం కలిగించే కృషిని తెలియజేశారు. కొత్తకొత్త రంగాల్లో పోరాటాలకు శ్రీకారం చుట్టే దిశగా చర్చలు సాగించారు. కార్మిక, కర్షక మైత్రిని కొనసాగించాలని పలువురు ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.



జివిఎంసి కార్మికులతో సెల్ఫీ దిగుతున్న మాజీ ఎంపీ ఎలమరం కరీం

# వినతులను త్వరితగతిన పరిష్కరించండి

## -జిల్లా ఇంచార్జ్ జెసి, ఐటిడిఎ పిఒ శ్రీపూజ- పిజిఆర్ఎస్‌కు 79 అర్జీలు

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 79 వినతులు వచ్చాయి. జిల్లా ఇంచార్జ్ జెసి, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ, ఇంచార్జ్ డిఆర్ఒ అంబేద్కర్, ఇంచార్జ్ ఆర్‌డిఒ ఎంవిఎస్ లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. సంబంధిత శాఖ అధికారులకు అందించి వినతులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. ఫిర్యాదుల్లో అత్యధికం రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, డిఆర్ డిఎకు సంబంధించినవేనని అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలోని అంతర్గత రహదారులు మండల కేంద్రం నుండి గ్రామాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడి కేంద్రాలకు అనుసంధానం అయ్యాయో లేదో ప్రస్తుత స్థితిని గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సర్వే, నివేదికలు చేయించాలని జిల్లా సర్వే, రెవెన్యూ, ఐటిడిఎ ఇంజనీరింగ్, పిఆర్, ఆర్అండ్ బి శాఖ అధికారులను ఆదేశించారు. మండల స్థాయి అధికారులు సమస్యలను పరిష్కరించుటలో కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని, పిర్యాధుదారునితో మర్యాద పూర్వకముగా వ్యవహరించాలన్నారు. ఫిర్యాదును ముగించుటలో ఎటువంటి అత్యుత్సాహం ప్రదర్శించరాదని, విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. టిడబ్ల్యూ డిడి పిబికె పరిమళ, భూగర్భ జలవనరుల శాఖ డిడి డి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్, డిఆర్ డిఎ పిడి వి.మురళీ, డిఎంహెచ్ఒ డి.కృష్ణమూర్తి నాయక్, జిల్లా మత్స్య శాఖ అధికారి సూర్యారావు, జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి జగన్మోహన్‌రావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.వి.రమణారావు, ఆర్ అండ్ బి ఇఇ బాలసుందరబాబు, గ్రామ వార్డ్, సచివాలయ నోడల్ ఆఫీసర్ పిఎస్ కుమార్, డిపిఒ కెపి చంద్ర శేఖర్, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్‌బాబు, డిపిఒ అధికారి ఎ.జయప్రకాష్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి ఝాన్సీరామ్ పడాల్, జిల్లా ప్రణాళిక అధికారి పి.ప్రసాద్, పలువురు తహసిల్దార్లు, ఎంపిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న పిఒ

## హైడ్రో ప్రాంతంలో హెలికాప్టర్ చక్కర్లు

**ప్రజాశక్తి -అనంతగిరి:** గత కొన్ని నెలల క్రితం ఆదివాసులు చేపట్టిన ఆందోళనలతో హైడ్రో పవర్ ప్రాజెక్టులు పనులు కాస్త మందగించాయి. అల్లూరి జిల్లా ఏజెన్సీలో పలు ప్రాంతాలలో గత రెండు, మూడు రోజుల నుండి హైడ్రో ప్రాంతంలో హెలికాప్టర్ చక్కర్లు కొడుతుండడంతో స్థానిక ఆదివాసి గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. గత కొన్ని నెలల క్రితం రాత్రుల సమయంలో డ్రోన్ కెమెరాలు చక్కర్లు కొట్టడంతో పై ఆందోళనలకు గురయ్యారు. డ్రోన్ కెమెరాలు అర్ధరాత్రి పూట తిరుగుతున్నాయని, తక్షణమే నిలుపుదల చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఆదివాసి గిరిజన సంఘం నేతలు, హైడ్రో పోరాట కమిటీ సభ్యులు లిఖిత పూర్వకంగా విన్నవించారు. దీంతో తాత్కాలింగాగా నిలిపివేశారు .ఆ తర్వాత నుండి గ్రామాలంతా ప్రశాంతంగా ఉన్నాయి. అనంతగిరి మండలం నాన్ షెడ్యూల్ గుమ్మ కోట పంచాయతీ గుజ్జెల్లి, అరకు మండలం బస్కి పంచాయతీ పరిధి దేవరపల్లి, హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలస వంటి ప్రాంతాలలో మిట్ట మధ్యాహ్నం సమయంలో కొండలకు తాకుతూ గ్రామాల ఆవాస ప్రాంతాలలో హెలికాప్టర్ చకర్లు కొట్టింది. దీంతో ఆయా ప్రాంతాల ఆదివాసి గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. చూసిన స్థానికులు వారి వారి కేమెరాలలో ఫోటోలు, వీడియోలను చిత్రీకరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు సర్వే కోసమే ఈ హెలికాప్టర్ తిరుగుతున్నట్లు స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు.



చక్కర్లు కొడుతున్న హెలికాప్టర్

## వాహనదారులు నిబంధనలు పాటించాలి

### -పాడేరు సిఐ దీనబంధు

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** వాహనదారులు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పోలీస్ స్టేషన్ సిఐ డి.దీనబంధు సూచించారు. ఈ నెల 1 నుంచి 31 వరకూ జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్ టిసి డిపో వద్ద మేనేజర్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిఐ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనాలను అజాగ్రత్తగా నడపడంతోనే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఘాట్‌లో నెమ్మదిగా నడపాలని, నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. డ్యూటీ సమయంలో ఆల్కహాల్ సేవించరాదని, వాహనం నడిపేటప్పుడు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవర్లకు పలు సూచనలు చేస్తూ పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు.




మాట్లాడుతున్న సిఐ

# నిర్వాసితుల కష్టాలు గట్టెక్కేనా?

- పోలవరం ప్రత్యేక జిల్లాతో చిగురించిన ఆశలు
- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందక అవస్థలు
- తాగునీరు, రోడ్డు సదుపాయం కల్పించాలి



పోతవరం నుండి కాలనీకి వెళ్లే రోడ్డు



చిన్నారిగండి ఆర్అండ్ఆర్ పెనికిలపాడు కాలనీ

**ప్రజాశక్తి-దేవీపట్నం:** మండలంలో పోలవరం నిర్వాసితులు సర్వం కోల్పోయి బయటకు వచ్చి నానా అవస్థలు పడుతున్నారు. దేవీపట్నం మండలంలో చిన్నారి గండి ఆర్అండ్ఆర్ పెనికిలిపాడు కాలనీ నిర్మించి కొన్ని సంవత్సరాలు గడిచినా అక్కడ కనీస సదుపాయాలు ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ప్యాకేజీ ఇచ్చారు. కానీ 38 మందికి ఇళ్లు మంజూరు చేయలేదు అధికారులు ఇస్తామని కాలయాపన చేస్తున్నారు తప్ప కాలనీలో సమస్యలు మాత్రం తీరడం లేదు. ప్రధానంగా త్రాగడానికి మంచినీరు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి కోసం సుమారు 13 కిలోమీటర్లు ఇందుకూరుపేట వచ్చి ఫిల్టర్ వాటర్ కొనుక్కుని వెళ్లాల్సివస్తోంది. వాహనాలు ఉన్నవారు వెళ్లి తెచ్చుకుంటున్నారు. వృద్ధులు తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దగ్గర్లో ఉన్న సత్యసాయి మంచినీటి పథకం నుండి పైప్‌లైను ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. అదేవిధంగా పోతవరం నుంచి కాలనీ వరకూ సరైన రోడ్డు లేదు. రాళ్లు తేలిపోయిన రోడ్డుపై వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. రహదారి బాగుచేయాలని కోరుతున్నారు.

**శిథిలావస్థకు చేరిన పాఠశాల**

ఇక్కడ పాఠశాల నిర్మించారు అప్పుడే అది శిథిలావస్థకు చేరుకుంది. గచ్చు పగుళ్లు వచ్చి కిందకి కుంగిపోయింది. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. కొండ ప్రాంతానికి దగ్గరగా ఉండడం వల్ల అడవి జంతువులు వస్తాయని విద్యార్థులు భయందోళన చెందుతున్నారు. తాగునీకి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

**చచ్చినా అవస్థలే..**

ఈ కాలనీలో ఎవరైనా మృతి చెందితే వారికి శ్మశానవాటిక కూడా లేక పోవడం చాలా బాధాకరంగా ఉందని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పక్కన ఉన్న స్థలం చూపుతున్నారు తప్ప వాటికి కావాల్సిన సదుపాయాలు మాత్రం ఏర్పాటు చేయలేకపోయారు.

పోలవరం ప్రాజెక్ట్ వల్ల 44 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. నిర్వాసితులకు పోతవరం నుండి పజ్జుల్లాబాద్ వరకూ గోకవరం మండలంలో ఉన్న పునరావాసం గోకవరంలో కృష్ణుని పాలెం కాలనీలో 18 గ్రామాలకు పునరావాసం కల్పించారు. ఇక్కడ 1064 కుటుంబాలు ఉండగా నేటికీ వారికి శ్మశానవాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలపై బయటకు తీసుకువచ్చి అంత్యక్రియలు చేయడానికి రూ.5వేలు లేదా రూ.10వేలు ఖర్చు అవుతోందని ఆందోళన చెందుతున్నారు. మరి కొన్నిచోట్ల స్మశాన వాటికలు ఉన్నా సరైన సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారని నిర్వాసితులు తెలిపారు. నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించి డబ్బులు సగం మందికి మాత్రమే చెల్లించారు. మిగతా వారికి అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము సర్వం కోల్పోయి ఇక్కడికి వస్తే కనీస సదుపాయాలు కల్పించడం లేదని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని నిర్వాసితులు కోరుతున్నారు.

### తాగునీరు అందించాలి



మేము గోదావరి పక్కన ఉన్నప్పుడు త్రాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేది. ఇక్కడికి వచ్చిన తర్వాత తాగునీటి కోసం అవస్థలు పడుతున్నాం. సత్యసాయి నీటి పథకం ద్వారా తాగునీటిని అందించాలి.

- కురసం కాంతమ్మ

### ఇళ్ల నిర్మాణానికి నగదు ఇవ్వాలి



పెనికిలపాడు కాలనీలో ఇళ్ల నిర్మాణం కోసం కొంతమందికి డబ్బులు ఇచ్చారు మాకు చాలామందికి ఇంకా డబ్బులు ఇవాల్సి ఉంది. సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలని కోరుకుంటున్నాను.

- జీడి పుల్లయ్యదొర

### రహదారి లేక అవస్థలు



పోతవరం నుండి మా కాలనీ వరకు రహదారి అధ్వానంగా ఉంది. ఎటువంటి వాహనాలు లోనికి రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరగా రహదారి సదుపాయం కల్పించాలి.

- జీడి నాగన్నదొర

# పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు కోసం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**ప్రజాశక్తి -సీలేరు:** పంప్డ స్టోరేజీ ప్రాజెక్టు కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఎపి జెన్‌కో అధికారులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీలేరు పంప్డ స్టోరేజీ జెఎసి సభ్యులు నక్కా జ్ఞానేశ్వరరావు, కారే శ్రీనివాస్, వల్లీ ప్రసాద్, చిటికెల రాము, బాలకృష్ణ, మిందీలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో సీలేరు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కులమతాలకు అతీతంగా ఇక్కడకు వచ్చి జలవిద్యుత్ కేంద్రం నిర్మాణంలో భాగస్వామ్యులయ్యామని, పనులు పూర్తయిన తరువాతే ఇక్కడే స్థిరపడి వ్యాపారాలు చేస్తున్నామన్నారు. కొత్తగా నిర్మించబోయే ప్రాజెక్టులో నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని, నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించాలని జేఏసీ డిమాండ్ చేసింది. అదేవిధంగా పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులో స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతతో భర్తీ చేయాలని డిమాండ్ చేసారు. ఈ విషయంలో ఒకరిని ఒకరు దూషించడం సరికాదని, రిజర్వేషన్లు హక్కులు కల్పన ప్రభుత్వం చూసుకుంటుందని,ఈ సందర్భంగా ఏపీ జెన్‌కో అధికారులు స్పందించి ప్రాజెక్టు నిర్మాణంలో స్థానికంగా ఉన్న వారికి, నష్టపోయిన వారిని ఆదుకోవాలని జెఎసి డిమాండ్ చేసింది. ఈ ప్రాంతంలో నివశించేవారికి విద్యుత్తు , వైద్యం, మంచినీరు సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.పిలోన్, వై.నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అఖిలపక్షనాయకులు




యుటిఎఫ్ కేలండర్‌ను తహశీల్దార్‌కు అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే యుటిఎఫ్ ధ్యేయం

**ప్రజాశక్తి- విఆర్‌పురం:** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే యుటిఎఫ్ ధ్యేయమని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు యస్.నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం తహశీల్దార్‌ని మర్యాద పూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రతి ఉద్యోగి చేతిలో యుటిఎఫ్ డైరీ ఉండాలనీ, ఈ డైరీలో సమాజానికి ఉపయోగపడే అతి ముఖ్యమైన సమాచారం పొందుపర్చడం జరిగిందని ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎన్.జగదీష్. మండల ఆడిటర్ రామకృష్ణ, ఐక్య ఉపాధ్యాయ పత్రిక మండల కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖన పోటీల్లో విజేతలకు 4న బహుమతి ప్రదానం

**ప్రజాశక్తి -సీలేరు:** స్థానిక ఎపి జెన్కో కళ్యాణ మండపంలో గత నెల 21న నిర్వహించిన చిత్రలేఖనపోటీల్లో జిల్లా పరిషత్ డిఎవి ఎపి గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్న సంగతి విధితమే. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఈ నెల 4వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు అలాగే చిత్రలేఖన ప్రదర్శన కార్యక్రమాన్ని స్థానిక రామాలయం సెంటర్లో ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మత్తు పదార్థాలు సామాజిక దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహించామని ఉపాధ్యాయులు సునీల్ తెలిపారు. కార్యక్రమానికి గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులను ఆహ్వానిస్తున్నామన్నారు.

## గౌనుకు నిప్పంటుకుని చిన్నారికి గాయాలు

**ప్రజాశక్తి -సీలేరు:** జికె వీధి మండలం ధారకొండ పంచాయతీ పెట్రాయి గ్రామానికి చెందిన కొర్ర దేవి (8) ఇంట్లో చలి మంట కాగుతుండగా ప్రమాదవశాత్తూ ఆమె ధరించిన గౌనుకు నిప్పంటుకుంది. పొట్ట ముందు భాగం, వీపు వెనక భాగం కాలిపోయి బొబ్బలు వచ్చాయి. కుటుంబసభ్యులు వెంటనే అప్రమత్తమై పాప శరీరంపై ఉన్న గౌను తొలగించడంతో ప్రమాదం తప్పింది. అనంతరం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి బాబ్జీ ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం చింతపల్లి అంబులెన్స్‌లో తరలిస్తామని నిరాకరిం చవద్దని దేవికి, వారి కుటుంబసభ్యులకు నచ్చచెప్పారు. వారు అంగీకరించడంతో అంబులెన్సులో చింతపల్లి పిహెచ్‌సికి తరలించారు.



కొర్ర దేవి

## దొర రామారావు ఆరోపణలు అర్థరహితం

### - ఈతపల్లి సత్యనారాయణరెడ్డి

**ప్రజాశక్తి -మారేడుమిల్లి:** ఆదివాసీ తెగలు అందరినీ కలుపుకుని ప్రజాసమస్యలపై నిత్యం పోరాటం చేసే దమ్ము, ధైర్యం, నాయకత్వం ఉన్న పార్టీ సిపిఎం అని, అటువం టి పార్టీపై రాష్ట్ర ఆదివాసీ జెఎసి ఉపాధ్యక్షుడు దొర రామారావు ఆరోపణలు చేయడం తగదని సిపిఎం మండల కార్యదర్శి ఈతపల్లి సత్యనారాయణరెడ్డి విమర్శించారు. దీనికి సంబంధించి ఒక ప్రకటనలో మాట్లాడుతూ వై.రామవరం మండలం, చింతలపూడి పంచాయతీలో ఇటీవల జరిగిన భారత ఆదివాసీ పార్టీ నిర్వహించిన సమావేశంలో దొర రామారావు మాట్లాడుతూ జిఒ నెంబర్ 3 పోవడానికి, యుటిఎఫ్‌లో ఉన్న లీలాప్రసాద్ కేసు వేయడం దానికి యుటిఎఫ్, సిపిఎం సహకారం అందించాయని ఆరోపించారన్నారు. కులప్రాతిపదికన జెఎసిలో కమిటీలు వేస్తున్నారని ఇది విభజన కాదా అని విమర్శించారు. సిపిఎం మీద చేస్తున్న ఆరోపణలను నిరూపించగలరా అని సవాల్ విసిరారు.



# కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ


చింతపల్లిలో పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

**ప్రజాశక్తి-చింతపల్లి:** . భూమి ఉన్న రైతుకు భరోసా కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపిపి అనూషాదేవి అన్నారు. ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ అభినందనీయమన్నారు. శుక్రవారం చింతపల్లి మండలంలోని చిన్నగడ్డ గ్రామంలో తహశీల్దార్ శంకరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించి రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేశారు. ఎంపిపి కోరాబు అనూష దేవి, జెడ్‌పిటిసి పోతురాజు బాలయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఊర్మిళ పాల్గొనిరైతులకు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం తహశీల్దార్ శంకరరావు మాట్లాడుతూ భూ హక్కుల పట్టాలు అందించడం ద్వారా, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు సులభంగా పొందేందుకు రైతుల భూములకు చట్టపరమైన భద్రత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కిముడు కృష్ణమూర్తి, పెదిరెడ్ల బేతాళడు, కె.శ్రీనివాస్ ఎల్ భూషణం, ఎంఆర్ఐ ముట్టడం కృష్ణమూర్తి, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

**కాశీపట్నం:**అనంతగిరి మండలం చిలకలగడ్డ పంచాయతీలో నూతన భూ పట్టాదారు పాస్‌పుస్తలను పంపిణీ శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ మండల అధ్యక్షులు చిట్టం మురళి హాజరై అర్హులైన లబ్ధిదారులకు భూ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,గ్రామంలో సంవత్సరాలుగా ఎదురవుతున్న భూ సమస్యలకు ఈ భూ పట్టాల పంపిణీ ద్వారా శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు సుబ్బారావు, బీజేపీ పార్టీ అధ్యక్షులు సోమరాజు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నరేంద్ర, తహసిల్దార్ వీరభద్ర చారి, డిప్యూటీ తహసిల్దార్ మాణిక్యం పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఒరాకఒడ్డు గ్రామానికి చెందిన 21 మంది రైతులకు, కత్తురు గ్రామానికి చెందిన 26 మంది రైతులకు భూ పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అప్పారావు, ఉప సర్పంచ్ కొండమ్మ, జనసేన పంచాయతీ నాయకులు సన్యాసిరావు, రాము, చంటి, విలేజ్ రెవెన్యూ అధికారి చిట్టిబాబు, ఆర్ఐ జగయమ్మ పాల్గొన్నారు.

**డుంబిగుడ:**కూటమి ప్రభుత్వంతో గిరిజన రైతులకు శాశ్వత పట్టాదారు పుస్తకాలు సాధ్యపడిందని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ టి సుబ్బారావు అన్నారు. మండలంలోని కించుమండ పంచాయతీ కుసుమగుడలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేశారు. తహసిల్దార్ త్రివేణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కూటమి శ్రేణులతో పాటు టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరావు గిరిజనుల రైతులకు పట్టాదారు పాస్ పుస్తకలను పంపిణీ చేశారు. గత ప్రభుత్వం రీ సర్వే పేరుతో కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేసిందన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్ర రైతాంగం అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు సుబ్బారావు, టి ఎన్ టి యు సి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు గంగాధర్, చిన్నగెన్ను, భీమరాజు, నరసయ్య, పొట్టి తదితరులు పాల్గొన్నారు.


డుంబ్రిగుడలో పట్టాలు పంపిణీ చేస్తున్న అధికారులు


చింతపల్లిలో పోస్టర్ ఆవిష్కరణలో చిన్నయ్యపడాల్

## 4న 'చలో విశాఖ'కు తరలిరండి

### సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్

### చింతపల్లిలో విస్తృత ప్రచారం : వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

**ప్రజాశక్తి-చింతపల్లి:** సిఐటియు అఖిల భారత 18వ మహాసభ ముగింపు సందర్భంగా ఈనెల 4న ఆదివారం ఆదివారం విశాఖపట్నంలో కార్మిక మహాప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం చింతపల్లి మండల కేంద్రంలో 'చలో విశాఖ' వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ, గత నెల 31 నుంచి ప్రారంభమైన మహాసభకు దేశంలోని 29 రాష్ట్రాల నుంచి కార్మిక ఉద్యమాల్లో పాల్గొన్న పోరాట యోధులు ప్రతినిధులుగా హాజరయ్యారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, కార్మిక వర్గంపై దాడులు, ఇతర సమస్యలపై మహాసభల్లో విస్తృతంగా చర్చ జరుగుతోందన్నారు.అలాగే రానున్న మూడేళ్లలో చేపట్టాల్సిన ఉద్యమాలు, కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించి ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. .

మహాసభ ముగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కార్మిక మహాప్రదర్శన ప్రారంభమై, సాయంత్రం 4 గంటలకు కొత్తరోడ్డులోని బహిరంగసభ వేదిక మున్సిపల్ గ్రౌండ్‌కు చేరుకుంటుదన్నారు. 4న కార్మిక ర్యాలీ, బహిరంగసభలో పెద్దఎత్తున కార్మికులు, ఇతర వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజులమ్మ, భవాని, గంగమ్మ, జయ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన రగ్గుల పంపిణీ

**ప్రజాశక్తి -అనంతగిరి:** ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యాన చలికాలం దృష్టిలో పెట్టుకొని 1000 మంది ఆదివాసి గిరిజనులకు రగ్గులు పంపిణీ చేపట్టారు. మండలంలోని టోకూరు పంచాయతీ జాకరవలస, బొరిబొరివలస, కుమ్మరివలస, ఎగువశోభ పంచాయతీ ఎగువశోభ, పొర్నపొదర్, పూలుగుడ గ్రామలకు చెందిన 1000 మంది గిరిజనులకు స్థానిక సిపిఎం జెడ్పిటిసి గంగరాజు, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో. సురేంద్ర రగ్గులు పంపిణీ చేశారు. చిన జీయర్ స్వామి సహకారంలో పంపిణీ చేశారు. ఈ సందర్బంగా రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వృద్ధులకు ఇప్పటికే గిరిజన ప్రాంతంలో 8000 వేల రగ్గులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో గిరిజన ప్రజలకు సేవా దృక్పథం తో రగ్గులు పంపిణీ చేస్తున్న స్వామిజి లకు గిరిజన ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపారు. ఈ కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కిల్లో. మోస్య, మాజీ సర్పంచ్ దొన్ను, గిరిజన సంఘం నాయకులు కిండంగి. రామారావు, గెమ్మెల. దేవన్న, పెషా కమిటీ సభ్యులు పాంగి .గోపన్న, శిరగం. అప్పలస్వామి, గెమ్మెల. భీమరాజు, పాంగి. అప్పలస్వామి, మాజీ సర్పంచ్ సొంటరి. సుబ్బారావు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



రగ్గులు పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు, స్వామిజీ

# గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

### అరకు ఎంపీకి గిరిజనులు, నాయకుల వినతి


హుకుంపేట, గడికించుమండ పంచాయతీల సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

**ప్రజాశక్తి- హుకుంపేట:** మండలంలోని హుకుంపేట, గడికించుమండ పంచాయితీల్లో నెల కొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ అరకు ఎంపీ గుమ్మా తనుజారాణికి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు గ్రామస్తులు కొండమ్మలతో కలిసి సమస్యలతో కూడిన మెమొరాండాన్ని అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, గడికించుమండ పంచాయితీ దొంతురాయి గ్రామంలో తాగునీరు సక్రమంగా అందడం లేదని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాలు వస్తే వర్షపు నీరు ఇండ్లలోకి చేరుతున్న పరిస్థితి నెలకొని ఉందన్నారు.

హుకుంపేట పంచాయితీ పరిధిలోని మొదమాంబ కాలనీ, సీపీఎం కాలనీ, నిలగడ్డ వీధి ప్రాంతాలకు గత ఐదేళ్లుగా సురక్షితమైన తాగునీరు అంద లేదని తెలిపారు. సంబంధిత అధికారులు ఈ సమస్యలపై ఏమాత్రం దృష్టి సారించకపోవడంతోనే ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓలకు తెలియజేసినా స్పందన లేదని, ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తాగునీటి సమస్యపై ఐటిడిఏలో జరిగిన గ్రీవెన్స్ (పీ.జీ.ఆర్.ఎస్) కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఫిర్యాదు చేస్తే, హడావుడిగా బోర్లు తవ్వి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పీ.జీ.ఆర్.ఎస్‌లో సమస్యలు తక్షణ పరిష్కారం అంటూ జిల్లా కలెక్టర్, జేసీలు, పీఓలు చేసే మీడియా ప్రకటనలే తప్ప ప్రజా సమస్యలు వాస్తవంగా పరిష్కారం కావడం లేదన్నారు.మండల కేంద్రంలో ప్రధాన రహదారి నుంచి పీహెచ్‌సీకి వెళ్లే దారిలో సీసీ రోడ్డు లేక నిత్యం వ్యాధిగ్రస్తులు, జూనియర్ కళాశాల విద్యార్థినులు నడక మార్గాన రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని ఎన్నిసార్లు కోరినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదన్నారు.మండల కేంద్రంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదని, అడ్డుమండ రహదారికి ఆనుకుని ఉన్న డ్రైనేజీని పీకేసి కొత్తదాన్ని నిర్మించకుండా, అర్ధాంతరంగా పనులు నిలిపివేశారని తెలిపారు. దీనిపై పంచాయితీ అధికారులు, మండల అధికారులు గానీ స్పందించకపోవడంతోనే ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడు తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సురక్షితమైన తాగునీరు, మెరుగైన డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు టి.రాంబాబు, సీహెచ్. సింహాచలం, పి.దొర, లింగమూర్తి, సూరిబాబు, ఈశ్వరరావు, లీలావతి, జ్యోతిరాజు పాల్గొన్నారు.

## విద్యార్థి అఖిల్‌కు ల్యాప్‌టాప్ వితరణ

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** గిరిజన విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఐటిడిఎ పిఓ తిరుమణి శ్రీపూజ అన్నారు. ఐటిడిఎ కార్యాలయంలో శుక్రవారం నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి సీటు సాధించిన అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ శివలింగపురంకు చెందిన గిరిజన విద్యార్థి శెట్టి అఖిల్‌ను అభినందించారు. ఐటిడిఎ నుండి ఆర్థిక ప్రోత్సాహకం అందించారు. ఉచితంగా ల్యాప్‌టాప్‌ను అందించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉందని, సరైన ప్రోత్సాహం అందిస్తే వారు ఉన్నత స్థాయిలో రాణించగలరన్నారు. ప్రభుత్వం ఎప్పుడూ చదువులో రాణించే గిరి విద్యార్థులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఓ (పివిటిజి) వెంకటేశ్వరరావు, ఎఓ హేమలత పాల్గొన్నారు.


అఖిల్ కు ల్యాప్‌టాప్ అందిస్తున్న పిఓ

## దత్తత గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాలు

**ప్రజాశక్తి-చింతపల్లి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 3,4 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఆధ్వర్యంలో పెండ్లిమామిడి, చౌటపాడు దత్తత గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక సేవా శిబిరాలు ప్రారంభించినట్లు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి తెలిపారు. తొలి రోజున ఈనెల 8 వరకు వారంరోజులపాటు నిర్వహించబోయే కార్యక్రమాలపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. దత్తత గ్రామాల్లో పరిశుభ్రత, సామాజిక అవగాహన, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. డిగ్రీ కళాశాల రాజకీయ శాస్త్ర అధ్యాపకులు జగదీష్ బాబు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. యువత తప్పుదారి పట్టకుండా సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, గ్రామ పెద్దలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పూర్ణారావు, నాగేశ్వరరావు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు


రాజేశ్వరిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తదితరులు

## మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేశ్వరికి ఘన సన్మానం

**ప్రజాశక్తి-కొయ్యూరు:** అల్లూరి జిల్లా పాడేరు నియోజకవర్గం కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీలో పార్టీ కార్యక్రమాలను బాధ్యతతో నిర్వర్తిస్తున్నందుకు చింతపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గర్రెంగి రాజేశ్వరి సేవలనుగి గుర్తించిన మంత్రి నారా లోకేష్ ప్రశంశాపత్రంను పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను బాధ్యతతో చేసేవాళ్లను పార్టీ తప్పకుండా గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి నేతలు పాల్గొన్నారు.

## జోరుగా రగ్గుల విక్రయం

**ప్రజాశక్తి -సీలేరు:** ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో చలి, మంచు తీవ్రత రోజురోజుకీ అధికమవుతోంది. గిరిజనులు చలిని తట్టుకోలేక ఉన్ని దుస్తులు కొనుగోలు చేయడానికి మక్కువ చూపుతున్నారు. ఎఒబి సరిహద్దులోని మారుమూల గ్రామల్లో రగ్గులు, జర్కిన్‌లు, ఉన్ని దుస్తులు విస్తృతంగా విక్రయిస్తున్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన వ్యాపారులు సీలేరు మసీదులో మకాం వేసి రగ్గులు విక్రయాలు జరుపుతున్నారు. జికె వీధి మండలం సీలేరు, ధారకొండ, దుప్పిలివాడ, గుమ్మిరేవులు పంచాయతీ పరిధి మారుమూల గ్రామాల్లో రగ్గులు, ఉన్ని దుస్తులు కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.


రగ్గులు విక్రయిస్తున్న దృశ్యం

## ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్లకు సత్కారం

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :** జాతీయ భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం విశాఖపట్నం, మద్దిలపాలెం డిపోలలో జరిగిన కార్యక్రమాలను ఆర్టిసి విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎడిసిపి ప్రవీణ్ కుమార్ హాజరై ఉత్తమ ప్రతిభ కనపరచిన డ్రైవర్లకు, ఉత్తమ మెయింటెనెన్స్ చేసిన మెకానికల్ సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ రోడ్డు భద్రత చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు. ట్రాఫిక్ ఎడిసిపి ప్రవీణ్ కుమార్,మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం వచ్చాక మరింత బాధ్యతలు పెరిగాయని, దీనికి తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించి, బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మెకానికల్ ఇంజనీర్ ఎ.గంగాధరరావు, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఉమా మహేశ్వరరెడ్డి, విశాఖపట్నం డిపో మేనేజర్ ఎ.మణి మాధురి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ రామకృష్ణ, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలవరం జిల్లా ఏర్పాటు హర్షణీయం

**ప్రజాశక్తి-మారేడుమిల్లి:** పోలవరం జిల్లా ఏర్పాటు హర్షణీయమని ఆల్ ఇండియా రాజ్యాంగ ఆదివాసీ స్వయంపాలన సమితి రాష్ట్ర కన్వీనర్ పల్లాల చిన్నారెడ్డి, ఆల్ ఇండియా రాజ్యాంగ ఆదివాసీ హక్కుల చట్టాల పరిరక్షణ సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ గరిడె బాబూరావు అన్నారు. శుక్రవారం ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ గతంలో రాజమహేంద్రవరంలో తమ ప్రాంతాన్ని విలీనం చేయొద్దని ఒకే వేదికపై ప్రతిఘటించడంతో ఈ రోజు ప్రత్యేక జిల్లా సాధించుకున్నామన్నారు. గరిడె బాబూరావు మాట్లాడుతూ ఇంతకాలం విడివిడిగా ఉన్న ఆదివాసీ సంఘాలు ఒకే వేదికను పంచుకుంటు పెసా, అటవీ, 1/70 చట్టాలను పటిష్టంగా అమలు పరుచుకునే నేర్పరితనంతో ఐక్యపోరాటాలు చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో పెసా గ్రామసభ తీర్మానం తప్పనిసరి అన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు కూడా ప్రజల్లో చైతన్యం వచ్చే దిశగా కృషి చేయాలన్నారు. అన్ని ఆదివాసీ తెగలు, సంఘాలు ఒకే వేదికను ఏర్పాటు చేసుకోవాలని దానిని రంపచోడవరంలో ఏర్పాటు చేయటానికి ఈ నెలలోనే సన్నాహాలు జరుగుతున్నాయని ప్రతి ఒక్కరూ మన రాజ్యం మన పాలన దిశగా అడుగులు వేయాలని ఆదివాసీ ప్రజలకు పిలుపునిచ్చారు.

రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఎసి నిర్విరామంగా పోరాటాలు చేసిందని ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు, ఆల్‌ఇండియా ఆదివాసీ ఎంప్లాయాస్ ఫెడరేషన్ ఎఎస్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంగల శ్రీనివాస్ తెలిపారు. ఇచ్చిన హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. అల్లూరి సీతారామరాజు పోరాటం చేసిన ప్రాంతం కాబట్టి "రంప'ను మొదటి తరం స్వాతంత్ర్యసమరయోధుడు కారం తమ్మన్న దొర పేరు కలిపి రంప కారం తమ్మన దొర జిల్లా గా పేరు మార్చాలని ఆదివాసి జేఏసీ డిమాండ్ చేసింది. జిల్లాలో కోట రామచంద్రపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న షెడ్యూల్డ్ ప్రాంతాలు జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాలను కూడా పోలవరం జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పోడియం పండుదొర, మడకం ప్రసాద్‌దొర, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న నాయకులు

**విఆర్ పురం:** రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేయటంపై కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి మామిడిరాజు, మండల ప్రజల తరపున అభినందనలు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మన్యం ప్రజల సమస్యలను ఎమ్మెల్యే శిరీషాదేవి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి నివేదించడంతో స్పందించిన ఆయన జిల్లా ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మామిడి రాజు అభినందనలు తెలిపారు.

# కార్పొరేట్లతో చంద్రబాబు, పవన్, బిజెపి లాలూచీ

### అప్పలరాజుపై పీడీ యాక్టు అంశం రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తాం

### అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శులు విజు కృష్ణన్, వెంకట్

**ప్రజాశక్తి-ఎస్.రాయవరం (అనకాపల్లి జిల్లా)**: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి నాయకులు కార్పొరేట్ కంపెనీలతో లాలూచీ పడి బలవంతపు భూ సేకరణకు పాల్పడుతున్నారని అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శులు విజు కృష్ణన్, బి.వెంకట్ అన్నారు. పీడీ యాక్టు కింద అరెస్టయిన ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కుటుంబాన్ని ఎస్.రాయ వరం మండలం ధర్మవరం గ్రామంలో శుక్రవారం ఉదయం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా విజు కృష్ణన్ మాట్లాడుతూ నక్కపల్లి ప్రాంతంలో బలవంతపు భూ సేకరణ, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ చట్టబద్ధంగా నిరంతం పోరాటం చేస్తున్న రైతు నాయకుడు అప్పలరాజుపై పీడీ యాక్టు పెట్టడం అప్రస్వామికమన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం 70 శాతం మంది స్థానికులు వ్యతిరేకిస్తే భూ సేకరణ చేయడానికి వీల్లేదన్నారు. కాని ఇక్కడ భూ సేకరణ వ్యతిరేకంగా స్థానికులు పోరాడుతుంటే నాయకులపై ఎమర్జెన్సీ కాలం లాగా పీడీ యాక్టు పెట్టి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. యుపిలోని గ్రేటర్ నోయిడాలో కూడా ఇలాగే బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా రెండు సంవత్సరాల పాటు పోరాటం జరిగిందని, అక్కడ కూడా దాదాపు 30 మంది నాయకులను మూడు నెలల పాటు జైలులో పెట్టారని తెలిపారు. ఇక్కడి ఉద్యమానికి మద్దతుగా సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం తరుపున జాతీయ స్థాయిలో పోరాటం చేస్తామని చెప్పారు.వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ చంద్రబాబు ఈ ప్రాంతంలో పర్యటన చేసిన వెంటనే పీడీ యాక్టు పెట్టి అరెస్టు చేశారని, చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్, బిజెపి కలిసి ఈ కేసు పెట్టారని విమర్శించారు. తాము అభివృద్ధికి వ్యతిరేకంగా కాదని, పరిశ్రమలు రావాలని, ఉద్యోగాలు కల్పించాలని కోరుతున్నామని, అభివృద్ధి పేరుతో జరుగుతున్న అరాచకత్వానికి అడ్డుకట్ట వేయాలని తాము చెబుతున్నాని తెలిపారు. ప్రభుత్వం భూ మాఫియాలా వ్యవహరిస్తుందని, దేశంలో మోడీ ఒక పెద్ద డాన్ అయితే, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మరో డాన్‌లులాగా వ్యవహరిస్తున్నారని, దేశంలోనూ, రాష్ట్రంలోనూ డాన్‌లపాలన సాగుతోందని ఘాటుగా విమర్శించారు. మిట్టల్ కంపెనీ, బల్క్ డ్రగ్ కంపెనీ, రాబోయే గూగుల్, ఇతర వాటిల్లో చంద్రబాబు, పవన్ కల్యాన్, బిజెపి నాయకులకు వాటాలు ఉన్నాయని, అందు కోసమే ఈ బలవంతపు భూ సేకరణ అని పేర్కొన్నారు. ఇక్కడ జరుగుతున్న ఉద్యమాన్ని అఖిల భాతర స్థాయికి విస్తరిస్తామని చెప్పారు. దీనిపై రాష్ట్రపతిని కలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఆయా సంఘాల జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఎం సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి మనబాల రాజేష్, నాయకులు కరి శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న విజుకృష్ణన్, వెంకట్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు

## తగ్గించిన వేతనాలు పెంచి చెల్లించాలి

### - 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :** ప్రైవేట్ భవ్య యాజమాన్యం 104 ఉద్యోగులకు తగ్గించిన వేతనాలను సరిచేసి పూర్తి వేతనాలు చెల్లించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన అధ్యక్షులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ల సాధన కోసం 104 ఉద్యోగులు త్వరలో చేపట్టనున్న సమ్మెలో భాగంగా శుక్రవారం సాయంత్రం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో 104 సంఘాల సమావేశంతో పాటు అఖిలపక్ష సంఘాల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవ్య యాజమాన్యం 104 ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. డిసెంబర్ 19 నుండి సమస్యల పరిష్కారం కోరుతూ, యాజమాన్యానికి నోటీసు ఇచ్చి, వివిధ పద్ధతులలో నిరసనలు తెలియజేసినా సమస్యలు పరిష్కారం కాలేదని, తప్పని పరిస్థితిల్లో 104 ఉద్యోగులు రోడ్డు ఎక్కాల్సి వచ్చిందన్నారు. తొలగించిన క్యాజువల్ లీవ్‌లు పునరుద్ధరించాలని, అన్ని ప్రభుత్వ సెలవులు వర్తింపచేయాలని, తొలగించిన బఫర్ సిబ్బందిని తిరిగి నియమించాలని, 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న డ్రైవర్‌లకు స్లాబ్ అమలు చేయాలని, 104 డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ జివో 7 ప్రకారం రూ.18,500 వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు. భవ్య యాజమాన్యం 104 ఉద్యోగులపై చేస్తున్న వ్యతిరేక చర్యలను ప్రశ్నించిన తమ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని అక్రమంగా సస్పెండ్ చేశారని, తక్షణం సస్పెన్షన్ రద్దు చెయ్యాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో 104 సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ సీనియర్ వాలీబాల్ జట్టు ప్రకటన

### - టోర్నీకి ఆంధ్ర జట్టు సారథిగా విశాఖ క్రీడాకారుడు

**ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ :** జాతీయ సీనియర్ పురుషుల వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర జట్టును శుక్రవారం ప్రకటించారు. వారణాసిలో జరగనున్న 72వ జాతీయ వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర పురుషుల జట్టుకు నగరానికి చెందిన అంతర్జాతీయ వాలీబాలర్, జీఎస్టీ అండ్ కస్టమ్స్ విశాఖ శాఖ ఉద్యోగి పిన్నమరాజు ప్రశాంత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ పోటీలు జనవరి 4 నుండి 11 వరకు జరగనున్నాయి. జట్టులో ఎస్.సుధీర్‌కుమార్, పి.గణేష్, వీరి వెంకటేష్, ఎం,సుదీర్, మైలపల్లి సత్యం, బీర భానుబాబు, మంతెన మనోజ్ దత్తా, ఐ.కళ్యాణ్ కుమార్, గుబ్బల శ్రీనివాస్, బుర్ల హేమంత్, బోకం ఆదిత్య, గోపిరెడ్డి వెంకటశివ, పెనుమత్స కృష్ణ చైతన్య ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రతిష్టాత్మక జాతీయ టోర్నీలో పాల్గొంటున్న ఆంధ్రజట్టు సభ్యులను అసోసియేషన్ ప్రతినిధులు అభినందించి పతకం సాధించాలని ఆకాంక్షించారు.

## అంతర్జాతీయ సంప్రదాయ నృత్య కాంగ్రెస్ ప్రారంభం

**ప్రజాశక్తి-ఎంవిపికాలనీ :** విశాఖపట్నం నగరానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, డ్యాన్స్ ఇండియా మాగజైన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఇంటర్నేషనల్ ట్రడిషనల్ డాన్స్ కాంగ్రెస్ (ఐటిడిసి -2026)' శుక్రవారం మద్దిలపాలెం కళాభారతిలో ఘనంగా ప్రారంభమైంది. జనవరి 4 వరకు మూడు రోజుల పాటు సాగే ఈ ఉత్సవానికి దేశ, విదేశాల నుంచి ప్రముఖ కళాకారులు, పండితులు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన గంటా శ్రీనివాసరావు, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ రమణమూర్తితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. బలదేవ నితాయి దాస్ బృందం సమర్పించిన నృసింహ స్తుతి' ప్రార్థనతో వేడుకలు ఆరంభమయ్యాయి. అమెరికా నుండి వచ్చిన స్వాతి గుండపునీడి అట్లూరి బృందం అద్భుత నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పద్మశ్రీ డాక్టర్ దర్శనా ఝువేరీ (మణిపూరి), కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత రాజేంద్రగంగనీ (కథక్) విలువైన సెమినార్లు నిర్వహించారు. సుమారు 60 మంది కళాకారులు పోటీలలో పాల్గొన్నారు. తొలిరోజు ముగింపులో భాగంగా, భారతీయ నృత్య రంగానికి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ దర్శనా ఝువేరీకి ఐటిడిసి -2026 లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్-2026ను ప్రదానం చేశారు.కార్యక్రమంలో ఐటీడీసీ వ్యవస్థాపక ఛైర్మన్ బిఆర్.విక్రమ్‌కుమార్, ఐటీడీసీ-2026 ఛైర్మన్ కెవి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.